అమ్మాయిలు అలవోకగా..

రాణించిన ప్రతీక, తేజల్

తొలి వన్డేలో భారత్ సునాయస విజయం

రాజ్‌కోట్: స్వదేశంలో ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌ను భారత మహిళల జట్టు విజయంతో ఆరంభించింది. రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్‌తో జరిగిన మొదటి వన్డేలో స్మృతి మంధాన సారథ్యంలోని భారత్.. 6 వికెట్ల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. యువ బ్యాటర్లు ప్రతీక రావల్ (96 బంతుల్లో 89, 10 ఫోర్లు, 1 సిక్స్), తేజల్ హసబ్నిస్ (46 బంతుల్లో 53 నాటౌట్, 9 ఫోర్లు) రాణించడంతో ఐర్లాండ్ నిర్దేశించిన 239 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 34.3 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 241 స్కోరు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్‌కు సారథి గాబీ లూయిస్ (129 బంతుల్లో 92, 15 ఫోర్లు), లీ పాల్ (73 బంతుల్లో 59, 7 ఫోర్లు) రాణించడంతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించింది. భారత బౌలర్లలో ప్రియా మిశ్రా (2/56) రెండు వికెట్లు తీయగా సయాలి (1/43), టిటాస్ (1/48), దీప్తి (1/41) తలా ఓ వికెట్ పడగొట్టారు. ప్రతీకకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఆదివారం ఇదే వేదికపై జరుగనుంది.

బౌలర్ల కట్టడి

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఐర్లాండ్ టాపార్డర్ వైఫల్యంతో 56 పరుగులకే 4 కీలక వికెట్లను చేజార్చుకుంది. ప్రియా, టిటాస్ కట్టుదిట్టంగా బంతులేసి ఐర్లాండ్‌ను నియంత్రించారు. కానీ ఐదో వికెట్‌కు గాబీతో జతకలిసిన పాల్.. భారత బౌలర్లను సమర్థవంతంగా నిలువరించింది. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 117 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. అయితే 39వ ఓవర్లో లీ పాల్ రనౌట్ అవడంతో ఆ జట్టు మళ్లీ గాడి తప్పింది. శతకం దిశగా సాగుతున్న గాబీ.. దీప్తి వేసిన 44వ ఓవర్లో ఆమెకే రిటర్న్ క్యాచ్ ఇచ్చింది. ఆఖర్లో అర్లెనె కెల్లీ (28) ఐర్లాండ్ స్కోరును 200 పరుగుల మార్కును దాటించింది.

తేజల్ (53*)

టీమ్‌ఇండియా దూకుడు

ఛేదనను భారత్ దూకుడుగా ఆరంభించింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మంధాన (29 బంతుల్లో 41, 6 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా పరుగులు రాబట్టింది. జార్జియానా వేసిన 8వ ఓవర్లో మంధాన.. 4, 6, 4 బాదింది. ప్రతీక కూడా వేగంగా ఆడటంతో రన్‌రేట్ 6కు తగ్గకుండా సాగింది. దూకుడుగా ఆడే క్రమంలో మంధాన.. ప్రియా వేసిన 10వ ఓవర్లో ఫ్రెండర్‌గస్ట్ చేతికి క్యాచ్ ఇవ్వడంతో 70 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. హర్లీన్ డియోల్ (20) సైతం ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయింది. జెమీమా (9) స్టంపౌట్ అయి నిరాశపరిచింది. ఈ క్రమంలో ప్రతీక, తేజల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. అంతగా అనుభవం లేకున్నా పరిణితితో కూడిన ఆటతీరును ప్రదర్శించారు. 70 బంతుల్లో తన కెరీర్‌లో రెండో అర్ధ సెంచరీని పూర్తి చేసిన ప్రతీక ఆ తర్వాత వేగం పెంచింది. క్రీజులో కుదురుకునే దాకా వేచి చూసిన తేజల్ సైతం.. వ్యక్తిగత స్కోరు 30 దాటాకా జూలు విదిల్చింది. మాగ్వైర్ 34వ ఓవర్లో 4, 4, 6తో 90కి చేరువగా వచ్చిన ప్రతీక మూడంకెల మార్కును అందుకునేలా కనిపించింది. కానీ అదే ఓవర్లో భారీ షాట్ ఆడబోయి ఫ్రెండర్‌గస్ట్‌కు క్యాచ్ ఇచ్చింది. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 84 బంతుల్లోనే 116 పరుగులు జతచేశారు. ఆఖర్లో రిచా ఘోష్ (8 నాటౌట్) రెండు బౌండరీలు బాది లాంఛనాన్ని పూర్తి చేసింది.

సంక్షిప్త స్కోర్లు

ఐర్లాండ్: 50 ఓవర్లలో 238/7 (గాబీ 92, పాల్ 59, ప్రియా 2/56, దీప్తి 1/41)

భారత్: 34.3 ఓవర్లలో 241/4 (ప్రతీక 89, తేజల్ 53 నాటౌట్, మాగ్వైర్ 3/57, ప్రియా 1/38)

ప్రతీక (89)

హోరాహోరీగా సెపక్‌తక్రా పోటీలు

28 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 10: జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్) వేదికగా 34 జాతీయ సీనియర్ సెపక్‌తక్రా పోటీలు శుక్రవారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఈనెల 14వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలతో పాటు రెండు సర్వీస్ టీమ్‌లు(ఎస్ఎస్‌బీ, ఆలిండియా పోలీస్) బరిలో ఉన్నాయి. తొలి రోజు పురుషుల, మహిళల జట్ల మధ్య పోటీలు జరిగాయి. పురుషుల విభాగంలో తెలంగాణ 0-3తో ఢిల్లీ చేతిలో ఓటమిపాలైంది. మిగతా మ్యాచ్‌ల్లో ఎస్ఎస్‌బీ 3-0తో మహారాష్ట్రపై, అసోం 2-1తో తమిళనాడుపై, మణిపూర్ 3-0తో ఉత్తరప్రదేశ్‌పై, మహారాష్ట్ర 2-1తో అసోంపై, మణిపూర్ 2-0తో తెలంగాణపై గెలిచి ముందంజ వేశాయి. మరోవైపు మహిళల కేటగిరీలో నాగాలాండ్ 2-1తో తెలంగాణపై, ఎస్ఎస్‌బీ 3-0తో ఉత్తరప్రదేశ్‌పై, బీహార్ 2-1తో అసోంపై, ఎస్ఎస్‌బీ 3-0తో బీహార్‌పై, మణిపూర్ 3-0తో హర్యానాపై గెలిచాయి. కేవలం కాళ్లు, తలతో ఆడే సెపక్‌తక్రా ఆట ఆద్యంతం అందరినీ ఉత్సాహపరిచింది. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ హనుమాండ్లరెడ్డి, ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

గంభీర్ మా కుటుంబాన్ని తిట్టాడు: తివారీ

కోల్‌కతా: టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ గంభీర్ లక్ష్యంగా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత ఓటమికి ప్రధాన కారణం గంభీర్ అని పేర్కొన్నాడు. ఓ వార్తా సంస్థతో తివారీ మాట్లాడుతూ 'పెర్త్ టెస్టులో రానాను ఎందుకు ఎంపిక చేశారు.ఢిల్లీకి ఆడుతున్న సమయంలో గంభీర్ నన్ను, నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకంటూ బూతులు తిట్టాడు. గంగూలీపై కూడా నోరు పారేసుకున్నాడు. గంభీర్ తిట్టిన ప్రతీసారి అతన్ని వెనకేసుకొచ్చేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారు' అని అన్నాడు.

యూపీ ఘన విజయం

- **జాతీయ హ్యాండ్‌బాల్ టోర్నీ**

మహబూబ్‌నగర్, జనవరి 10 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి జట్లు తరలిరాగా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. బాలికల విభాగంలో ఉత్తరప్రదేశ్ జట్టు 29-3 తేడాతో ఝార్ఖండ్‌పై ఘన విజయం సాధించగా, పంజాబ్ 23-01 తేడాతో నవోదయ విద్యా సమితిపై, గుజరాత్ 14-05 తేడాతో ఉత్తరాఖండ్‌పై, బాలుర విభాగంలో డీఏవీ 17-16 తేడాతో మధ్యప్రదేశ్‌పై, ఢిల్లీ 26-07 పుదుచ్చేరిపై గెలిచి ముందంజ వేశాయి.

కోహ్లీతో యువీ కెరీర్ క్లోజ్

రాబిన్ ఊతప్ప సంచలన వ్యాఖ్యలు

ముంబై: భారత క్రికెట్ దిగ్గజం యువరాజ్ సింగ్ అర్ధాంతరంగా క్రికెట్ కెరీర్‌ను ముగించేందుకు కోహ్లీ కారణమని మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సంచలన వ్యాఖ్యలు చేశాడు. శుక్రవారం ఊతప్ప మాట్లాడుతూ ' పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు ఉన్న యువీ దేశానికి రెండు ప్రపంచకప్‌లు అందించాడు.క్యాన్సర్‌ను దిగ్విజయంగా జయించి తిరిగి క్రికెట్‌లోకి అడుగుపెట్టాను. అప్పుడు కెప్టెన్‌గా ఉన్న కోహ్లీ నిర్దేశించిన కొన్ని ఫిట్‌నెస్ నిబంధనలు యువీ కెరీర్ ముగిసేందుకు కారణమయ్యాయి. సడలింపులు ఇవ్వాల్సి ఉన్నా.. వెనుకకు తగ్గకపోవడంతో యువీకి జట్టులో చోటుదక్కలేదు' అని అన్నాడు.

జై షాకు బీసీసీఐ సన్మానం

ముంబై: కొద్దిరోజుల క్రితమే ఐసీసీ చైర్మన్‌గా నియమితుడైన జై షాను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సన్మానించనుంది. ఆదివారం (జనవరి 12న) ముంబైలో జరిగే స్పెషల్ జనరల్ మీటింగ్ (ఎస్‌జీఎం)లో బీసీసీఐ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. షా.. 2019 అక్టోబర్ నుంచి గతేడాది నవంబర్ దాకా బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగాడు.

బాంబ్రీ జోడీ ఓటమి

ఢిల్లీ: ఆక్లాండ్ ఏఎస్‌బీ ఇంటర్నేషనల్ క్లాసిక్ టోర్నీలో భారత డబుల్స్ టెన్నిస్ ప్లేయర్ యూకీ బాంబ్రీ, అల్బనో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం పోరాటం సెమీ ఫైనల్లోనే ముగిసింది. పురుషుల డబుల్స్ సెమీస్‌లో బాంబ్రీ-ఒలివెట్టి జోడీ 3-6, 6-1, 5-10తో మెక్టిక్-వీనస్‌చేతిలో ఓడింది.

నీరజ్ ది బెస్ట్

ఢిల్లీ: గోల్డెన్ బాయ్, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా గతేడాది ప్రపంచంలో అత్యుత్తమ పురుష జావెలిన్ త్రోయర్‌గా గుర్తింపు దక్కించుకున్నాడు. ఈ మేరకు ప్రఖ్యాత అమెరికా మ్యాగజైన్ 'ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్'.. 2024 ర్యాంకింగ్స్‌లో నీరజ్ చోప్రాను వరల్డ్ బెస్ట్ జావెలిన్ త్రోయర్‌గా గుర్తించింది. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో రజతం సాధించిన నీరజ్.. పలు డైమండ్ లీగ్ పోటీలలోనూ సత్తా చాటాడు. నీరజ్ తర్వాత రెండో స్థానంలో గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ ఉన్నాడు. పారిస్‌లో రికార్డు త్రో తో స్వర్ణం గెలిచిన పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్.. ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

సెమీస్‌కు సాత్విక్ జోడీ

కౌలాలంపూర్: మలేషియా ఓపెన్‌లో భారత స్టార్ జంట సాత్విక్-చిరాగ్ సెమీఫైనల్స్‌కు ప్రవేశించింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో ఏడో సీడ్ భారత జోడీ 26-24, 21-15తో యూ సిన్ ఓంగ్-ఇ యి టియోను చిత్తుచేసింది. 49 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్ తొలి గేమ్‌లో ఇరు జట్ల షట్లర్లు హోరాహోరీగా పోరాడారు. మొదటి గేమ్ విరామానికి ముందు 11-9తో స్వల్ప ఆధిక్యంలో ఉన్న భారత ద్వయం దానిని 20-19కు తీసుకెళ్లింది. ఆ తర్వాత వరుసగా 4 పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం ప్రత్యర్థికి పోరాడే అవకాశం ఇవ్వకుండా జోరు పెంచి వరుసగా మూడోసారి సెమీస్‌కు చేరింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.